



# 12

## పెద్దింటి అశోక్ కుమార్



కాళ్ళకు బూట్లు వేసుకుంది కావ్య. బూట్ల చివరలు చినిగి వున్నాయి. బొటన వేలు దాని పక్క వేలు రెండూ బయటకు వచ్చాయి. సాక్సులు ఉన్నాయి కాబట్టి రెండు వేళ్లు ఒక వేలు లాగా కనిపిస్తున్నాయి. వేళ్లను ఒకసారి కదిలించి చూసుకుని షెల్ఫ్‌లో ఉన్న టై బెల్ట్ బ్యాడ్జ్‌లను అందుకుంది కావ్య. బ్యాడ్జ్ జేబుకు పెట్టుకుంది. బెల్ట్‌ను పెట్టుకుని టైని మెడలో వేసుకుంది.

నల్లటి బ్యాడ్జ్ మీద FIRST IN CLASS అన్న తెల్లటి అక్షరాలు మెరుస్తున్నాయి. ఒకసారి వాటిని అపురూపంగా తడుముకుంది కావ్య. గత మూడు నెలలనుండి దానిని తనే దక్కించుకుంటుంది కావ్య. థర్డ్ యూనిట్‌లో మాత్రం కొంత కష్టంగా ఉంది. గణితం తప్ప అన్నింట్లో మార్కులు చెప్పారు. ర్యాంకులో ఉండే నజీమా హఠాత్తుగా ముందుకొచ్చింది ఇప్పుడు.

టోటల్ మార్కుల్లో ఇప్పుడు నజీమా కావ్య కంటే ఒక మార్కు ముందుంది. ఈరోజే గణితం మార్కులు ఇస్తానంది టీచర్. ఎలాగైనా నజీమా కంటే రెండు మార్కులు ఎక్కువ సంపాదించాలనే పట్టుదలతో ఉంది కావ్య. అందుకోసం ఒక ప్లాన్ కూడా తయారు చేసుకుంది. గణితం పీరియడ్ వరకు నజీమతో స్నేహంగా ఉండి గణితం పీరియడ్‌లో ఆమె పక్కనే కూర్చోవాలని నిర్ణయించుకుంది.

టీచర్ పేపర్ ఇవ్వగానే ఎక్కడైనా నజీమకు ఎక్కువ మార్కులు పడ్డాయో చూడాలనుకుంది. తనకు ఎక్కడైనా తక్కువ మార్కులు పడ్డాయో చూడాలనుకుంది. కొసరి, కొట్లాడి, అలిగి అబద్ధమాడి ఎలాగైనా ఎక్కువ మార్కులు సంపాదించుకోవాలనుకుంది. పొద్దున నాలుగవ పీరియడ్ గణితం.



# ములాఖత్

స్కూలు బ్యాగు కోసం చూసింది. కావ్య. అది కనిపించలేదు. అడుగులో అడుగు వేస్తూ పిల్లలా ఇల్లంతా వెదికింది. కనిపించలేదు. రాత్రి హోంవర్క్ చేసుకొని పీటకిందనే ఉంచింది. అక్కడ పెన్నులున్నాయి. కానీ బ్యాగు లేదు.

వంటింట్లోకి తొంగి చూసింది కావ్య. అమ్మ పొయ్యిముందు కూర్చుంది. గొట్టంతో పొయ్యిని ఊదుతుంది. ఇంటినిండా పొగ. బ్యాగులో ఆమె మసక మసకగా కనిపిస్తుంది. వెనుక వైపు నుంచి ఆమె వెంట్రుకలు మాత్రం చిక్కగా కనిపిస్తున్నాయి.

అమ్మను పిలుద్దామనుకుంది కావ్య. భయమేసి మానుకుంది. 'అమ్మో... ఇంకేమైనా ఉందా... వీపు పలుగుతుంది' అనుకొని మరోసారి ఇల్లంతా చూసింది. బ్యాగుపై షెల్ఫ్‌లో కనిపించింది. అందకుండా ఉంది. ఇంతవరకు తన పనులన్నీ పిల్లిలా నక్కి నక్కి నిశబ్దంగా చేసుకుంది కావ్య. ఇప్పుడు బ్యాగుతో సమస్య మొదలయింది. బ్యాగు అందుబాటులో ఉంటే రెండడుగుల్లో గడప దాటేదే.

స్టూల్ కోసం వెదికింది కావ్య. వంటింట్లో కనిపించింది. తల్లి చూడకుండా స్టూల్‌ను తెచ్చుకుంది. ఈ రోజు ఎలాగైనా బడికి వెళ్లాలి. తెలుగులో రెండు పద్యాలు ఇంగ్లీషులో పోయం ఎవరూ గుర్తు చేసి ఉండరు. 'వి వన్ వి టు, వి త్రీ' వెర్బ్‌లైతే ఎవరూ రాసి వుండరు. టీచర్ పదే రాసుకరమ్మన్నాడు. నేను పద్యాలన్నీ గుర్తు చేసాను. ఇరవై వర్బ్‌లు రాసాను. ఎవరికీ చూపించకూడదు. పద్యాలు వచ్చని ఎవరికీ చెప్పకూడదు. అనుకుంటూ స్టూల్ ఎక్కింది. రెండు చేతులతో బ్యాగును లాగింది. బ్యాగు మీద స్టీలు గ్లాసుంది. ఎత్తు తక్కువగా ఉండి అది కావ్యకు కనిపించలేదు.

బ్యాగు చేతిలోకి వచ్చిందికాని గ్లాసు కిందపడింది. గ్లాసును అందుకోబోయింది. బ్యాగు జారిపోయింది. సొలిగిపడబోయి నిలదొక్కుకుంది కావ్య. బ్యాగు గ్లాసు రెండూ పీటమీద పడ్డాయి. బ్యాగులోని పుస్తకాలు పెన్నుల బాక్సు కిందపడ్డాయి.

'కావ్యా... ఏమిటా చప్పుడు...? ఏం చేస్తున్నావు' వంటిట్లోంచే గద్దించింది తల్లి.

కావ్య గుండె జల్లుమంది. కాళ్లు వణికాయి. 'ఏం లేదమ్మా...' అంటూ స్టూలు దిగింది. చెల్లా చెదురైన పుస్తకాలను బ్యాగులో సర్దుకుంది. పెన్నుల బాక్సును పుస్తకాల మధ్య ఉంచింది. ఈ పనులన్నీ గబగబా చప్పుడు కాకుండా చేసుకుంది. ఎడమ చేతిని వంచి బ్యాగును భుజాన వేసుకొని వీపు పైకి దోపుకుంది. బయటకు అడుగు పెట్టబోతుంటే తల్లి చూసింది. చేతులున్న గొట్టాన్ని విసిరికొట్టి పరుగెత్తుకొచ్చింది.

తల్లిరావడం చూసి పరుగెత్తబోయింది కావ్య. రెండంగల్లో వచ్చిన తల్లి వీపు మీదున్న బ్యాగును అందుకుని వెనక్కిలాగింది. కావ్య కూలబడిపోయింది.

'బడికి వద్దన్నగదనే... మల్ల తయారైనవా...? రేపు పోదువని చెప్పినగదా...' కోపంగా అంటూ జుట్టు అందుకుంది తల్లి.

కావ్యకు కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. లేచి నిలబడుతూ బ్యాగును జారవిడిచింది. దబ్బుమని బ్యాగు కిందపడిపోయింది. బ్యాగును అందుకుని అదే షెల్ఫ్‌లో ఉంచుతూ 'ఇట్ల జేత్తవనే అందకుంట మీద వెట్టిన. సుప్పనాతి మొఖంది ఎట్ల చూసిందో... ఆరుగాలం జేసింది అడివిలపోతుంది. సదివి నువ్వు ఎవలనుద్దరిత్తవు. తవ్వంత పిల్లుంటె తల్లికా సరనట. ఆ మూట్లిప్పు... సద్ది గట్టిత్త చేనుకాడికి పో... నేను పగటి యాల్ల వరకు వత్త' అన్నది తల్లి కోపంగా గద్దిస్తూ.

కావ్య ఆశలన్నీ ఆవిరైపోయాయి. తల్లి చూడకుండా తప్పించుకొని పోదామనుకున్న ఆమె ప్లాను ఫలించకపోవడంతో కండ్లు నులుముకుంటూ తల్లిని చూసింది. తల్లి కూతురును పొలంకు పంపే పనిలో ఉంది. టిఫిన్ బాక్స్‌లో అన్నం, గిన్నెలో కూర పెట్టి మూత పెట్టింది. పాత దస్తీలో మూట కట్టి కావ్య చేతిలో పెట్టింది.

'ఈ సావులు నా సావుకచ్చినయి. ఒక్కింట్ల పీనుగు లేత్తే కులమంతా ఉండాలంటరు. వారానికోసావు గావట్టె. ఎట్లెల్లుతది.... సావు సందమయ్యేసరికి పొద్దుగూకె...' అంటూ కావ్య బూట్లను చూసింది తల్లి.

'ఏందే... చెప్పితే చెవుకి మీద పేను వారుతలేదా...' అంటూ లేసులను లాగింది.

భయం భయంగా బూట్లను విప్పింది కావ్య. సాక్సులను లాగి బూట్లలో కుక్కి టిఫిన్ బాక్స్‌ను అందుకొని వేగంగా వెనక్కి తిరిగింది. కోపాన్నంతా నడకమీద చూపిస్తూ తప్ప తప్ప అడుగులేస్తూ బయటకు వచ్చింది. తల్లి కావ్య వెంటనే బయటకు వచ్చి గట్టిగా అరుస్తున్నట్టు 'ఇగో... పోయినట్టుగాదు... అక్కడ ఆట వెట్టకు ఆట... పొద్దునపూట చిలుకలత్తయి. పొద్దు దిరుగుడు దగ్గరుండు. పన్నెండు గొట్టంగ కరంటత్తది పెట్టు. బాయిల నీళ్ళు అయిపోతే బందుజెయ్యి కరంటు పోవుకుంట వత్తది. వచ్చినప్పుడల్లా మోటర్ వెట్టు. ఆటలవడి మరిచిపోయ్యేవు. మోటర్ కాలిపోయినా చేను ఎండిపోయినా అదే బాయిల పాతర వెడత...ఆ...' అన్నది.

వాకిలి దాటబోతు ఆగిపోయింది కావ్య. ఏడుపు ముంచుకొస్తుంది. చేతులున్న టిఫిన్ డబ్బాను నేలకు విసిరికొట్టాలన్నంత కోపం. కండ్లు తుడుచుకుంటూ వెనక్కి తిరిగి ఇంట్లోకి వచ్చింది కావ్య. మెడలో టైని తీసి విసిరికొట్టింది. ఎదురుగా ఉన్న తల్లిని పక్కకు తోసి ఇంట్లోకి పోయింది. దొంతి కుండలో ఉన్న నువ్వులను నూకలను జేబులో నింపుకుంది. తల్లి పిలుస్తున్నా వినకుండా టిఫిన్ డబ్బాను అక్కడే పడేసి బయటకు నడిచింది.

తల్లి కోపంగా 'పో బిడ్డపో... ఒకనాడు ఎండితె తెలుస్తుంది...' అన్నది అంతలోకే ఏదో గుర్తొచ్చినట్టు పరుగు పరుగున బయటకు వచ్చి' కానుగు చెట్టు దిక్కు పోకు... పాము... పాము తిరుగుతుంది.' గట్టిగా అన్నది.

కావ్యకు ఆ మాటలు వినిపించలేదు. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ సంది దాటింది. కండ్లు తుడుచుకుంటూ పొలం బాట పట్టింది. పిల్లలు అప్పుడప్పుడే ఒకరిద్దరు బడికి వెళ్లున్నారు. వాళ్లు అక్కడక్కడా ఆగి నేస్తగాళ్లను పలకరిస్తూ పోతున్నారు. కొందరు పిల్లలు వాళ్లను చూసి 'ఇప్పుడే పొయ్యి ఏం జేస్తావు ఊదుస్తవా' అని ఎగతాళి చేస్తున్నారు. కొందరు

తల్లులు వాళ్లను చూసి తమ పిల్లలను తొందర పెడుతున్నారు.

కావ్య తరగతి వాళ్లు ఒకరిద్దరు పరుగెత్తు కుంటూ వచ్చి ఆమెను పలకరించారు. హోంవర్క్ గురించి పద్యాల గురించి అడిగారు. ఎవరికీ ఏమీ చెప్పలేదు కావ్య. మొహం మాడ్చుకొని ముందుకు నడిచింది. దారి మధ్యలో సవిత ఎదురయ్యింది. స్కూల్ డ్రెస్ వేసుకుంది గాని టై బెల్టు పెట్టుకోలేదు. పాలచెంబుతో ఇంటికి వెళ్తుంది. కావ్యతో మాట్లాడాలని చూసింది సరిత. 'నీతో నాకేం పని లేదనట్టు' మూతి తిప్పుకుంటూ వెక్కిరించింది కావ్య. ఆమె తన బాడ్జి వైపే చూస్తున్నట్టు తను తియ్యలేదని గుర్తుకు వచ్చి చేతిని అడ్డం పెట్టుకుంటూ దాటిపోయింది.

పక్కీరోళ్ల సంది ముందుకు నుంచి వెళ్తుంటే నజీమా గుర్తుకొచ్చి వాళ్ల ఇంటిముందు ఆగింది. జేబులోంచి నువ్వులు నూకలు తీసి నోట్లో వేసుకుని నములుతూ ఇంట్లోకి చూసింది. కావ్యను చూసిన నజీమా తల్లి కూతురుతో ఏదో చెప్పింది. బీడీలు చేస్తున్న నజీమా చాటును పక్కకు పెట్టి పరుగెత్తుకొచ్చింది.

'ఇంగ్లీషు హోం వర్క్ చేసినవా.... పద్యాలు గుర్తు చేసినవా...' నములుతూ అడిగింది కావ్య. అప్పటికి గాని అది గుర్తుకు రానట్టున్నాయి నజీమాకు. కావ్య వైపు బేలగా చూస్తూ లేదన్నట్టు తలూపింది.

'స్కూలుకు వెళ్తావా...మరి' అడిగింది కావ్య.

వెళ్తానన్నట్టు తలూపింది నజీమా.

కావ్య ఆశ్చర్యంగా చూస్తూ 'వెళ్తావా... నిన్న తెలుగు సారు ఇంగ్లీషు సారు ఏమనుకున్నారో తెలుసునా...' అడిగింది కావ్య. తెలియదన్నట్టు తలూపింది నజీమా.

'కావ్య భయం భయంగా చూస్తూ' లాస్ట్ పీరియడ్‌లో చాక్‌పీస్ తేవడానికి ఆఫీసు రూంలోకి వెళ్లినప్పుడు ఇద్దరు మాట్లాడుకుంటున్నారు. రేపు సెవెంత్ పిల్లలను ఏం చేస్తానో చూడు అని తెలుగు సారంటే నేనైతే మట్టలు విరగొట్టడం ఖాయం అని ఇంగ్లీషు సారన్నాడు' అన్నది.

కావ్య మాటలకు నజీమా హడలెత్తిపోయింది. 'మరి నువ్వు గుర్తు చేసావా...' అన్నది అసూయగా. కావ్య లేదని తలూపింది. 'మరి ఎలా...?' అంది నజీమా నమ్మలేనట్టు చూస్తూ.

'నేను బడికి రావట్లేదు కదా...' జేబులోంచి నువ్వులు నూకల్ని నోట్లో పోసుకుంటూ అన్నది కావ్య.

"మా అమ్మ ఊకోదు. వీపు చీరేస్తుంది." చెప్పింది నజీమా భయంగా. వీళ్లిద్దరిని గమనిస్తున్న నజీమా తల్లి ఒక కేక వేసింది. 'అడ్డమైనోళ్లు వద్దన్నా ఇంటికత్తరు. పనిగానియ్యరు. మన్నుగానియ్యరు... నజ్జీ... బడికపోవా...' దాని సోపతి పట్టద్దని చెప్పినా...' అన్నది.

నజీమా ఉల్కి పడ్డది. కావ్య మరింత భయపెట్టింది. నజీమా భయపడ్డది. కావ్య మరింత దగ్గరగా జరిగి నజీమా చెవిలో 'నువ్వు ఈ రోజు బడికి వెళ్తే చేతులు విరిగినట్టే. మన క్లాసువాళ్లు చాలామంది వెళ్లడం లేదు. నాతో మాపొలం దగ్గరికిరా... అక్కడ చింతకాయలు బబ్బరి కాయలన్నయి." అన్నది గుసగుసగా.

నజీమా మొహంనిండా నవ్వు కనిపించింది. అంతలోకే మళ్లీ భయం. 'మరి మీ... అమ్మ...' అన్నది సందేహంగా. ఇద్దరి అమ్మల కొట్లాట గుర్తుకు వచ్చింది.

'మా అమ్మరాదు నాన్న రాడు. నేనొక్కదాన్నే... తొందరగా రాపోదాం' అంటూ వెళ్లి సంది మలుపు దగ్గర నిలబడింది. ఇప్పుడే వస్తనన్న నజీమా అరగంటయినా రాలేదు.

కావ్యకు భయం పట్టుకుంది. అమ్మనో నాన్ననో అటువైపు వస్తారేమోనని ఒక వైపు.... దగ్గరి వాళ్లు ఎవరైనా చూస్తారేమోనని ఒకవైపు. సార్లు వస్తారనో... పిల్లలు సార్లకు చెబుతారనో ఒకవైపు భయం భయంగా గడిపింది. కోపం వచ్చి వెళ్లిపోదామనుకునే సమయంలో నజీమా బయటకు వస్తూ కనిపించింది. కావ్య రమ్మనట్టు సైగ చేసింది. నజీమా పరుగందుకుంది. ఆమె భుజానికి స్కూలు బ్యాగు.

ఇద్దరూ చూపులతోనే మాట్లాడుకున్నారు. పెద్దబజారు వెంట కాకుండా సందుల గుండా ఊరు దాటారు. ఊరు దాటే వరకు వెనకాముందు చూస్తూ నడిచారిద్దరు. ఊరు దాటాక నెత్తిమీది బరువు దిగినట్టయింది. అంతవరకు దూరం దూరం నడిచినవారు పక్క పక్క చేరారు.

ఎప్పుడెప్పుడా అని చూస్తున్న నజీమా కావ్య జేబులో చెయ్యిపెట్టి పిడికెడు నువ్వుల్ని అందుకొని బుక్క నిండా పోసుకుంది. ఆమె చేతిని విసిరికొట్టాలనుకుని ఆగిపోయింది కావ్య. చనువుగా తన బ్యాగును కావ్య భుజానికి వేస్తూ 'అబ్బా... కొద్ది సేపే' అంది నజీమా.

కావ్య పరుగెత్తబోయింది. అంతకంటే వేగంగా పరుగెత్తి బ్యాగును ఆమె భుజానికి వేసి అందకుండా పరుగెత్తింది నజీమా. ఆమెను అందుకోవడానికి పరుగెత్తింది కావ్య. నజీమా బక్కగా కాస్త పొడవుగా

## కిటికీతో బంధం

వాసా ప్రభావతి

**నా** గుండె తలుపుల్లా
ఆ కిటికీ తలుపులు
ఎప్పుడూ తెరచే ఉంటాయి!
ఉభయ సంధ్యల్లో
విరబూసిన ప్రకృతి అందాలు
ఆ గది అంతా చూపె
నిలువుటద్దం ఆ కిటికీ!
వెన్నెలవేళ చల్లని కిరణాలు
గిలిగింతలు పెడుతుంటె
మనసు చాటున మసలుతున్న
స్నేహబంధాలు గుప్పున విరబూసి
నన్ను చుట్టి గిలిగింతలు పెడతాయి
వర్షించేవేళ
వానజల్లులు తుంపరలై
కిటికీలోంచి వచ్చి నన్ను ముంచెత్తినవేళ
బాల్యపు జ్ఞాపకాలతో నా మనసును
ముంచేస్తుంది
చీకటిరాత్రిలో
తెల్లని నక్షత్రాలు పకపకనవ్వుతూ
నా గుండెలను ఆనందంతో
పూరిస్తాయి!
ప్రపంచ జ్ఞానమంతా
ఆ వీధిలోనే ప్రత్యక్షమై
నా కళ్ళకు వినోదాన్ని అందించే
ఆ కిటికీ నా ఆలోచనకు
మెరుగులుపెడుతూ
నన్ను ముందుకు నడిపిస్తూ
ఉంటుంది
అందుకే ఆ కిటికీతో బంధం
విడతీయరానిది
అది ఏనాటిబంధమో!
అది నా జీవనయానబంధము!

ఉంటుంది. అందకుండా పరుగెత్తింది. 'అటు గాదు ఇటు' అని దారిమార్చింది కావ్య. నజీమా వెనక్కి వచ్చింది. సులువుగా ఆమెను అందుకుని బ్యాగును ఆమె భుజానికి వేస్తూ 'కాదు... వట్టిగనే అన్న. అటువైపే' అంటూ నవ్వింది కావ్య.

బ్యాగు నాలుగుసార్లు భుజాలు మారింది. ఒకసారి కిందపడింది. నజీమా అలిగింది. 'నేను రాను... నేను బడికే పోత'. అంటూ వెనక్కి తిరిగింది.

'అబ్బా... వద్దబ్బా... బ్యాగు నేనే మోస్తలే 'అంటూ దుమ్ము దులిపి బ్యాగును భుజాన వేసుకుంది కావ్య. నజీమా మరో పిడికెడు నూకల్ని నోట్లో పోసుకుంది. చెట్టుకొమ్మల్ని విరుస్తూ రాళ్లను విసురుతూ ఇద్దరూ పొలం వద్దకు చేరుకున్నారు.

చుట్టూ బీడుపొలాలు. అక్కడక్కడా ఓయాసిస్సుల్లా పచ్చని పొలాలు. కావ్య వాళ్ల పొలం ఎకరం పైనే ఉంటుంది. కింద రెండు మడ్లు పొద్దు తిరుగుడు పువ్వు. పక్కనున్న రెండు మడ్లు కంది. పైనున్న రెండు మడ్లు మాత్రం వరి. కంది మడిలో మంచె వేసి ఉంది.

కావ్య పొలంలోకి అడుగు పెట్టేసరికి పిట్టలగుంపు చిలకలగుంపు పొద్దుతిరుగుడు మీద యుద్ధం చేస్తున్నాయి. కావ్య ఆందోళనగా మంచెను చేరుకుంది. బ్యాగు అక్కడ ఉంచి కట్టెను డబ్బాను అందుకుంది. డబ్బా కొడుతూ 'లే...లే...లే...ఖడే...ఖడే...' అని అరుస్తూ ఒడ్డు వెంట జింక పిల్లలా పరిగెత్తింది కావ్య. కావ్యను అనుసరించింది నజీమా. ఆమె అరుపులో అరుపును కలిపింది. ఈ మెరుపుదాడికి చిలకలు పిట్టలు దగ్గర్లో ఉన్న చెట్ల పైకి ఎగిరాయి. కొన్ని దొంగ చూపులు చూస్తూ పువ్వుల మీదనే నక్కి కూర్చున్నాయి.

చిలకల మర్మం కావ్యకు తెలుసు. పువ్వు కదలికను చూసి అవి ఎక్కడున్నయో గుర్తు పడుతుంది. డబ్బేరేకును కొడుతూ రెండు మళ్లు కలియ తిరిగింది. డబ్బా చప్పుడు పెద్దగా ఉందా ఆమె గొంతు పెద్దగా ఉందా అంటే ఆమె గొంతే పెద్దగా ఉంది. అన్నంత స్పష్టంగా గొంతెత్తి అరిచింది. నజీమా గొంతులో గొంతు కలుపుతూ ఆటలా ఆమెను అనుసరించింది.

నజీమాకు పొలం కొత్త. మొక్కల్ని పాపుకుని తిరగడంలో తడబగింది. రెండు మూడు మొక్కల్ని విరగొట్టింది. రెండుసార్లు కిందపడిపోయింది. ఆకులు కాండము కాళ్లు చేతులకు గీరుకుపోయాయి.

ఆమె అవస్థను గమనించి 'నువ్వు ఈ మంచె మీద కూసోనబ్బా.. నేను తిరుగత. కొద్దిసెపైతే



చిలుకలు పిట్టలుండయి. ఇద్దరం ఆడుకుందాం' అన్నది కావ్య.

నజీమాకు దురద మొదలయింది. గోక్కుంటూ 'సరే' అంది. కావ్య నజీమాను మంచె ఎక్కించి పొద్దుతిరుగుడు వైపు వచ్చి చిలకలతో పోటీ పడింది. వాటికంటే వేగంగా ఎగురుతుంది. ఇక మన పప్పులు ఉడకవని చిలకలు, పిట్టలు తోక ముడుచుకున్నాయి.

నజీమాకు దురద ఎక్కువయింది. గోకుతుంటే కాళ్లు చేతులపై వాతల్లా దద్దులు తేలుతున్నాయి. భయమేసింది. నిలబడి 'కావ్యా... ఓ కావ్యా...' అంటూ అరిచింది.

ఆ పిలుపు కావ్యకు వినిపించలేదు. ఇంకో శబ్దం చెవికి వినిపించేంత విరామం లేకుండా డబ్బాను కొడుతూ అరుస్తుంది కావ్య. నజీమాకు దురద మరింత ఎక్కువై ఏడుపు ముంచుకొస్తుంది. మంచె పైకి ఎక్కి సైగ చేసింది. కావ్య గమనించి కొడుతున్న డబ్బాను అరుస్తున్న నోటిని ఆపకుండానే మంచె పైకి చేరింది.

నజీమా ఎక్కెక్కి పడి ఏడుస్తుంది.

కావ్యకు భయమేసింది. 'ఏమైందబ్బా... నజీమా... ఏమైంది...? భయమైతందా... నాతో ఉంటావా...?' అడిగింది.

నజీమా బదులుచెప్పలేదు. ఏడుస్తుంది. చేతుల డబ్బా, కట్టె కిందపడేసింది కావ్య. ఆమె గడ్డం పుచ్చుకొని బతిమాలుతూ 'అబ్బా... ప్లీజబ్బా... చెప్పబ్బా... ఏమైంది...? దెబ్బతాకిందా' అంటూ కాళ్లు చేతులు చూపింది.

కాదన్నట్టు తలూపుతూ దద్దుర్లను చూపింది నజీమా. ఎర్రటి చర్మం అక్కడక్కడా జాజు వర్ణంలో ఉబ్బి ఉంది.

అది చూసిన కావ్య తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. భయం ఎగిరిపోయింది. ' ఓ...పిరికి పిల్ల... గిదానికే ఏడుత్తున్నవా... నాకు మస్తుసార్లయింది. జరాగు.. నీకు మంత్రమేత్త...' అంటూ కిందికి దిగి పిడికెట బూడిద గునుగు ఆకుతో పైకెక్కింది.

ఏడున్నానే విచిత్రంగా చూస్తుంది నజీమా. పక్కన కూర్చోమని చెబుతూ 'ఓం... చుప్ చుప్ మంత్రం... చుప్ కాలి మంత్రం... ఓం... బీం... హాం... ఫట్' అంటూ బూడిద ఆకుతో కాళ్లు చేతులు రాసింది. క్షణాల్లో దురద మాయం.

కావ్యనే కాపుగాస్తున్న చిలకలు తొంగి తొంగి చూస్తూ పూల మీదికి వచ్చివాలాయి. కావ్య వాటిని మరిచిపోయింది. నజీమాకు మంత్రం వేయడంలో మునిగిపోయింది. దురద తగ్గినా నజీమా ఏడుస్తూనే ఉంది. కావ్యకు భయమేసింది.

'ఆగబ్బా... తగ్గుతది. ఏడవకు... నాకైతే రక్తం కారింది తెలుసా... సూడూ... మంత్రం ఇంకోసారేత్త అంటూ బతిమాలుతూ కాల్లకు చేతులకు బూడిది రాసి 'చుప్' మంది కావ్య. ఆమెను నమ్మించాలని ఒకటికి రెండుసార్లు కళ్లు మూసుకుని పిడికిడి బిగపట్టి బూడిద మంత్రమేసింది.

కావ్య ఆందోళన చూస్తుంటే నజీమాకు సంతోషంగా ఉంది. ఆమెను మరింత కంగారు పెట్టాలని ఏడుపు రాగం అందుకుంది. కావ్య ఊరడించాలని చూసింది. నజీమా ఆపలేదు. ఏదో గుర్తొచ్చి తన జేబులో నువ్వులు నూకల్ని దులిపి ఆమె చేతులో పోసింది కావ్య. వాటిని నోట్లో పోసుకొని నములుతూనే రాగం అందుకుంది.

కావ్య దిగులుగా చూస్తూ 'ఏందబ్బా... ఇంటికి పోతవా...' అడిగింది.

నజీమా ఔనన్నట్టు తలూపింది. కావ్య దిగులుగా మొహం పెట్టింది. నజీమా నవ్వుకుంది. కావ్య ఆమెకు నచ్చజెప్పుతూ 'ఇప్పుడు ఇంటికెళ్ళితే బడికి ఎందుకు పోలేదని మీ అమ్మకొట్టదా... పగటిపూట బడి ఇడిసినప్పుడు పోదాం తియ్యి. నేను గూడా వత్త. సార్లు రాలేదని చెప్పుదాం దోసకాయలు తింటావా... ఇయ్యన్నా...' అన్నది. దోసకాయల పేరు చెప్పగానే నజీమా నోరు మూతపడింది. సరేనన్నట్టు తలూపింది.

పిట్టలకు చిలకలుకు ఇష్టారాజ్యమయింది. అవి కావ్యను వెక్కిరిస్తూ ఆమె నెత్తిమీదే ఎగురుతున్నాయి. కావ్య మాత్రం నజీమాను ప్రసన్నం చేసుకునే పనిలో పడింది. కంది చేనులో దోసతీగలున్నాయి. కానీ ఇప్పుడే పూత మీదున్నాయి. ఏదో ఒకటి ఆశ చూపాలని అలా అన్నది.

ఇద్దరూ కంది చేనులోకి వచ్చారు. కాళ్లకు చేతులకు మొక్కలు ఆకులు అంటకుండా నడుస్తుంది నజీమా. ఇద్దరూ దోస తీగల్లో తిరుగుతున్నారు. కాయలు కనిపించడంలేదు. అక్కడక్కడా చిటికెన వేలి పొడవున్న పువ్వు పిందెలున్నాయి. కొద్దిసేపు తిరిగిన తర్వాత పిందెల్ని తెంపడం మొదలెట్టింది నజీమా. ఎక్కడ పిందె కనిపించినా తెంపి నోట్లో వేసుకుంటుంది.

ఇది కావ్యకు బాధగా ఉంది. అవి మూరెడు పొడవున కాసే ఊరదోసకాయలు. తనే ఇంత వరకు ఒక్క పిందె తెంపలేదు. అమ్మ అడిగితే ఏం చెప్పాలా అని భయపడుతుంది.

పిందెలు తియ్యగా ఉన్నాయి. నోట్లో వేసుకుంటే కరిగిపోతున్నాయి. కావ్యతో పనిలేకుండా నజీమా పిందెల్ని ఏరుతుంది. వద్దని వారించాలని చూసింది కావ్య. నజీమా వినలేదు.

నజీమాను ఎలా వారించాలా అని చూస్తున్న కావ్యకు పొలం పక్కన బీడులో రెండెద్లు కనిపించాయి. వెంటనే "ఏ... నజీమా... ఇటురానబ్బా... ఎద్లు చేన్లమేస్తున్నాయి. 'అంటూ అటువైపు పరిగెత్తి' అదె అదే... అవ్వో మంచిగున్నాయి. చేన్లకత్తయట..' అన్నది అంటూ ఒడ్డు మీదినుంచి కానుగు చెట్టుకిందుగా కంచె వరకు పరుగెత్తింది. ఎద్లు చాలా దూరంలో ఉన్నాయి.

కావ్య కనుమరుగు కాగానే నజీమాకు భయమేసింది. పిందెల్ని తెంపబోతూ రెండు మూడు తీగల్ని తెంపింది. వాటిని విసిరికొడుతూ పరుగున వచ్చి ఒడ్డు ఎక్కి చూసింది. కావ్య పొలం చివర కనిపించింది. అటు పరుగెత్తాలని చూసింది. సన్నని ఒడ్డు, మంచుతో తడిసిన గడ్డి. నడవడానికే వీలుకాలేదు మెల్లిగా నడుస్తూ కానుగ చెట్టు నీడన కొద్దిసేపు నిలబడింది. అక్కడ పచ్చగడ్డి మీద బారెడు పాము కుబుసం కనిపించింది.

వింతగా చూస్తూ దాన్ని చేతిలోకి తీసుకుంది నజీమా. ఆటవస్తువులా దాన్ని చేతుల్లో తిప్పుతూ కావ్యను చేరుకుంది. దాన్ని చూడగానే కావ్య ఉలిక్కి పడ్డది. కొద్దిసేపు భయమేసింది. తల్లిచెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అప్పటికే అది నజీమా చేతుల్లో నాలుగు ముక్కలయింది. దాంట్లో గాలి ఊదబోతుంటే ఆపి కిందపడేయమంది.

'ఏంటి దబ్బా... ఇది...' పారేస్తూ అడిగింది నజీమా.

కావ్య చెప్పలేదు. చేతుల్ని మాత్రం శుభ్రంగా కడిగించింది. బురదపెట్టి మరీ తోమి కడిగించింది. అప్పటికి పొద్దు పైకెక్కింది. బడినుండి సెకండ్ బెల్ వినిపించింది. ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. చేతుల్ని ఫ్రాక్‌కు తుడుచుకుంది నజీమా. ఇద్దరూ మంచెవద్దకు వస్తుండగా మైక్‌లో 'వందేమాతరం' వినిపించింది. ఇద్దరి కాళ్లకు బ్రేకులు పడ్డాయి. కొద్దిసేపు కాళ్లల్లో ఏదో కంపనం. ఇద్దరు తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది.

ఈసారి మంచె వైపు కాకుండా బాయి వైపు దారితీసింది కావ్య.

'గటెటబ్బా... కందిచేను ఇటుగదా...' ఆగి అన్నది నజీమా.

కావ్య వినిపించుకోలేదు. నజీమా కొద్దిసేపు ఆగి ఆమెను అనుసరించింది. ఇద్దరూ మోటర్ పంపు వద్దకు చేరుకున్నారు. బోదర్‌లో కొన్ని నీళ్లున్నాయి. బోదర్ అంచున కూర్చుంది కావ్య. కాళ్లను నీళ్లల్లో పెట్టి ఆడించింది. ఆమె పక్కన కూర్చోబోతూ జారి బురదలో పడింది నజీమా. ఆమెను అందుకోవాలని లేచింది కావ్య. అందలేదు.

అంచునే బాయి. ఇటుకాకుండా అటువైపు జారితే బాయిలో పడేదే. బురదలో ఫ్రాక్ మొత్తం తడిసిపోయింది. కావ్య ఆమెను లేవనెత్తింది. లేస్తూనే ఏడపందుకుంది నజీమా.

'ఆ... అంత బురదయింది.... మా అమ్మ కొడతది... ఆ...' రాగం అందుకుంది నజీమా ఆమెను ఒడ్డుపైకి తెచ్చి 'ఏంగాదబ్బా... నేను ఉతికిస్త తియ్యి. ఇక్కడ బట్టల సబ్బుంది. మా అమ్మ మా బట్టలు ఇక్కడే ఉతుకుతది' అంటూ నచ్చ జెప్పింది.



జయంతి పాపారావు, ఆచార్య ఎస్. శేషారత్నం సంపాదకులుగా ప్రచురించిన "నూరేళ్ళు - నూరుగురు కథకులు - నూరు కథానికలు" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ॥ సత్యనారాయణ, సంపాదకులు జయంతి పాపారావు, ఆచార్య ఎస్. శేషారత్నం, ప్రముఖ హిందీ రచయిత్రి శ్రీమతి చిత్రా ముద్గల్ న్యూఢిల్లీ తదితరులు.

'మరి ఉతుకు...' అంటూ ఫ్రాక్ చూపించింది.

ఆమెను బోదర్ వద్దకు తెచ్చింది కావ్య. బోదర్‌లోకి దిగగానే నీళ్లన్నీ బురద రంగులోకి మారిపోయాయి. అదే నీళ్లతో ఫ్రాక్‌ను కడిగింది కావ్య. బురద పోయిందికాని తెల్లని ఫ్రాక్ నడుము వరకు బురద రంగులోకి మారిపోయింది. నజీమా రాగం పెంచింది.

'అయ్యో... ఏడువకబ్బా... మంచిగ పిండిస్త ఇడువు' అన్నది కావ్య భయంగా.

నజీమా ముందుగా బిడియంగా చూసింది. 'ఏంగాదబ్బ... ఎవ్వలు లేరుగదా' అన్నది కావ్య. చుట్టూ చూసి ఫ్రాక్ విడిచి ఇచ్చి అరటి చెట్టు చాటుకు దాక్కుంది. కావ్య ఫ్రాక్‌కు సబ్బురాసింది. బురద నీళ్లతో ఫ్రాక్ మొత్తం బురదపోయింది. కావ్యకు భయం పట్టుకుంది. అలాగే ఒడ్డుమీద ఆరేసింది.

'పిండినవానబ్బా...' చెట్టు చాటునుంచి నజీమా కేక వేసింది.

'పిండిన ఎండని.. జరంత సేపు అట్లనే కూసో...' అంటూ పైకి చూసింది. చిలకలు పిట్టల మందలు మందలుగా పువ్వు మీద వాలుతున్నాయి.

వెంటనే మంచె దగ్గరికెళ్లి డబ్బారేకును అందుకుని పొద్దుతిరుగుడు వద్ద పరిగెత్తింది.

నజీమా అప్పుడప్పుడూ లేచి చూసి మళ్లీ కూర్చుంటుంది. రెండుమూడుసార్లు కావ్యను పిలిచింది. కావ్య పలుకలేదు. ఏడుస్తూ బయటకు వచ్చింది. ఫ్రాక్‌ను చూసాక మరింత ఎక్కువయింది. అది విని నజీమా వద్దకు పరుగెత్తుకొచ్చింది కావ్య.

'నా ఫ్రాక్ ఖరాబయింది... మా అమ్మ కొడుతది... నేను నీ పేరే చెప్పుత తియ్యి...' ఏడుస్తూనే అన్నది నజీమా. కావ్యకు భయమయింది.

'అబ్బా... చెప్పకబ్బా... మీ అమ్మ.. మా అమ్మ మాట్లాడుకోరు గదా... బీడేల కార్ఖానల ఇద్దరికి కొట్లాటయిందట. నువ్వు చెప్పితే మా అమ్మ నన్ను కొడుతది. అన్నది బతిమాలుతూ.

'మరి మా అమ్మ నన్ను కొట్టదా...' ఏడుస్తూనే అంది నజీమా.

కావ్య కొద్దిసేపు ఆలోచించింది. తర్వాత తన ఫ్రాక్ విప్పి నజీమాకు తొడిగింది. నజీమా పచ్చి ఫ్రాక్‌ను తను వేసుకుంది. నజీమా తన ఫ్రాక్ విప్పిన నజీమాకు తొడిగింది.

నజీమా పచ్చి ఫ్రాక్‌ను తను వేసుకుంది. నజీమా తన ఫ్రాక్ వైపు చూసింది. అచ్చం తనదిలాగే ఉంది. class in first బ్యాడ్జ్ మెరిసిపోతుంది. ఆమె కళ్లు తలుక్కుమన్నాయి. బ్యాడ్జ్‌ని గర్వంగా చూసుకుంది. కుడి చెయ్యితో తడుముకుంది.

కావ్య తనను తాను చూసుకుంది. ఫ్రాక్ సరిపోయినా నీరు కారుతూ చల్లగా ఉంది. బురద వాసన వస్తుంది. ఆమె చూపులు బ్యాడ్జ్‌ను లాక్కుంది. నజీమా అందకుండా పారిపోదామని చూసింది. పరుగెత్తడానికి వీలుపడలేదు.

ప్రతిఘటించాలని చూసింది. కావ్య ఒడుపుగా లాక్కుని పెట్టుకుంది. ఇప్పుడు చల్లని స్పర్శలేదు. బురద వాసన లేదు. నలుపు రంగు లేదు. తన ఫ్రాక్ మెరుస్తున్నట్టుగానే అనిపించింది. నజీమా కావ్య వైపు నిరాశగా చూసింది.

సరిగ్గా అప్పుడే స్కూల్ నుంచి నాలుగు గంటలు వినిపించాయి. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. 'బ్యాడ్జ్ నాదే... నాకే ఒక మార్కు ఎక్కువుంది కదా...' నజీమా 'కాదు... నాదే... నాకే గణితంలో ఎక్కువ మార్కులొస్తాయి'. కావ్య అన్నది. ఇద్దరూ కొద్దిసేపు వాదులాడారు. కావ్య బ్యాడ్జ్ జారి కిందపడిపోయింది. పచ్చి గడ్డిలో ఇద్దరూ వెదుకుతున్నారు.

చిలుకలు పిట్టలు తినాల్సిన గింజలన్నీ తిని కావ్యను వెక్కిరిస్తూ ఎగిరిపోతున్నాయి. దూరంగా ఉన్న రెండు ఎడ్లు కంచెను దాటి వరిమడిలోకి వచ్చి మేస్తున్నాయి. అప్పుడే కరెంటు వచ్చినట్టుంది. పైపులోంచి నీళ్లు మడిలోకి దూకి పడుతున్నాయి. తొక్కిసలాటలో కట్ట తెగి నీళ్లు బీడుపొలంలోకి పారుతున్నాయి.

కావ్య ఏమీ గమనించలేదు. బ్యాడ్జ్ కొరకే దీక్షగా వెదుకుతుంది. అది కనిపించకపోతే క్లాస్ టీచర్ కొడతాడని భయం.

బ్యాడ్జ్ నజీమాకు దొరికింది. కావ్యకు కనిపించకుండా జేబులో వేసుకుంది. కొంతసేపు వెదికినట్టు నటించింది. లేచి నిలబడింది. కావ్య ఆతృతగా ఆందోళనగా గడ్డిలో బురదలో ఒడ్డుమీద వెదుకుతూనే ఉంది. నజీమా నవ్వుకుంది. అటువైపు బావి. ఇటువైపు వరిమడి. రెండింటి మధ్యలో చిన్న ఒడ్డు. ఒడ్డు మీద నజీమా నిలబడితే కావ్య వంగి వెతుకుతుంది. నజీమా కావ్యను పక్కకు తోసింది. కావ్య విరుచుకుపడిపోయింది. పడదం పడదం వరిమడిలో పడటంతో బతికిపోయింది. కాని మొహంనిండా బురద. దూరంగా కావ్య తల్లి వస్తుంది. చేనులో మేస్తున్న ఎడ్లను చూసి మొత్తుకుంటుంది.

నజీమా అక్కడినుంచి మంచెను చేరుకుంది. బ్యాగు తీసుకుంది. నక్కి నక్కి పొలందాటి రోడ్డు మీదికి వచ్చింది. అప్పటికి కావ్యతల్లి ఎడ్లను దూరం తోలి కర్రతో కావ్యను చేరుకుంది.

రోడ్డుమీద నడుస్తున్న నజీమా జేబులోంచి బ్యాడ్జ్ తీసుకుంది. ఫ్రాక్‌కు పెట్టుకుంది. సంతోషంతో తడుముకుంది. అప్పుడు కావ్య కేకలు వినిపించాయి. నజీమాకు 'అమ్మా... వద్దే... కొట్టకే... కొట్టకే... వద్దే...' అని

నజీమాకు భయమేసింది. పరుగందుకుంది. ఊర్లోకి చేరేసరికి చుట్టి అయింది. పిల్లలతో కలిసి ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం స్కూలుకు వెళ్లింది. క్లాస్‌టీచర్ కనిపించి నజీమాను అభినందించింది. మ్యాక్స్ టీచర్ మరీనా. కావ్యకు జ్వరం. మంచంలోంచి లెవ్వడం లేదు. మూసిన కన్ను తెరవడం లేదు. తల్లిదండ్రులకు భయం పట్టుకుంది. ఊళ్ళో డాక్టర్‌కు చూపిస్తున్నారు. మందులు వాడుతున్నారు. అయినా గుణం కనిపించడంలేదు.

వరుసగా వారంరోజులు రాకపోయేసరికి నజీమాకి బెంగ పట్టుకు్ఉంది. సాయంత్రం కావ్య ఇంటికి వెళ్లింది. నజీమాను చూసి బలహీనంగా నవ్వింది కావ్య. నజీమా వచ్చి పక్కన కూర్చుంది. ఇద్దరి చేతులు స్పర్శించుకున్నాయి. కావ్య ఏదో అడగాలని ఆగిపోయింది. నజీమా పిడికిలి తెరిచింది. అందులో బ్యాడ్జ్ నువ్వన్నట్టు మ్యాస్‌లో నాకు తక్కువగా వచ్చాయి. నీకు బైకిబై నువ్వే క్లాస్ ఫస్ట్ అంటూ బ్యాడ్జ్‌ను కావ్యకు అందించింది నజీమా. మంచంలోని నీరసంగా లేచి కూర్చుంది కావ్య. నజీమా చేతిని అసరగా ఇచ్చి కూర్చోబెట్టింది. కావ్య కల్లు తళుక్కున మెరిసాయి. బ్యాడ్జ్‌ను, నజీమా చేతిని ప్రేమగా అందుకుంది. అప్పుడే కావ్య తల్లి అటువైపు వచ్చింది.

ఆమె కంట పడకుండా వెళ్లిపోయింది నజీమా. మరునాడు చెకింగ్ కోసం వచ్చిన డాక్టర్ కావ్య తల్లితో 'సగానికి సగం తగ్గింది. రేపటితో పూర్తిగా కోలు కుంటుంది' అన్నాడు.

## గాథ

**కొలకలూరి ఇనాక్**

(జీవిత శకలమో
దృశ్యమో
సందర్భమో - విషయమై
ధ్వనో
అలంకారమో
రసమో
వక్రోక్తో - స్ఫురించే
గాథకు
36 మాత్రలు మించవు)

అమ్మ
ఒక కన్ను
ఆలి
ఒక కన్ను
చూశాడు
భువిలో దివిని

భార్య మెడ
చిలక్కొయ్యకు
భర్త
వేలాడదీసిన
హేంగర్
తాళి

బ్రతుకు
చెప్పుల
పాలీష్‌కు
రాస్తున్నాడు
నిద్రించని
కన్నీటిని

పరాభవ
జ్వాలతో
కుమిలి
కాలే
వామి
హృదయం

యౌవనం
కడలి
అలలు
ఒడ్డుకు
కొట్టుకొంటేనే
శాంతి

హృదయ
దేవాలయం
ముందు
వెలిగించిన
దీపాలు
కళ్ళు

తెలుపు
ఏడురంగులై
పగులుతుంటే
వినిపించే
సరిగమలే
అలలు

నర్తకిని
ప్రేమించి
నాట్యం
నేర్చిన
యువకుడు
పెండ్యులం

## విజ్ఞప్తి

**రచయితలు తమ రచనలతోపాటు హామీపత్రాన్ని విధిగా జతచేసి పంపవలెను. అట్లు జతచేయని రచనలు పత్రికలో ప్రచురణకు స్వీకరించబడవు.**